ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు

గురువారం 25 జూలై 2024

జిల్లా వార్తలు



నేడు జిల్లాలో విద్యాలయాలకు సెలవు

పాడేరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద తీవ్రత కొనసాగుతుండడంతో గురువారం కూడా జిల్లాలోని విద్యాలయాలకు సెలవును పొడిగిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం రాత్రి అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో బుధవారం వరదల ప్రభావం తగ్గక పోవడంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాలయాలకు సెలవులు ప్రకటిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వరదల నేపథ్యంలో ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ఆయన సూచించారు.



జీకేవీధిలో రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం



ముంచంగిపుట్టులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



చింతపల్లి మండలంలోని తాజంగి-లంబసింగి రహదారిలో బ్రిటీష్ అతిథి గృహం వద్ద కూలిన భారీ వృక్షం

వర్ష బీభత్సం

- పలుచోట్ల నేలకొరిగిన భారీ వృక్షాలు
- వాహనాల రాకపోలకు తీవ్ర అంతరాయం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
- ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు
- కలెక్టర్, అధికార యంత్రాంగం పర్యవేక్షణ

పాడేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి):

జిల్లాను వర్షాలు ముంచెత్తుతున్నాయి. బుధవారం సైతం ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీగా ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు వారం రోజుల నుంచి పాడేరు మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతుండడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జిల్లాలో వర్షాలు కొనసాగుతుండడంతో గెడ్డలు, వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ, మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో కుమడ, బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతాల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగిగెడ్డ, లోచలిగెడ్డ, హుకుంపేట మండలంలో మత్స్యగుండం, చీడిపుట్టు, లివిటి, రాళ్లగెడ్డలు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీని వల్ల ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల మండలాల్లో గెడ్డలకు అవతల ఉన్న గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టడం, ముంపు ప్రాంత ప్రజల్ని అప్రమత్తం చేయడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించలేదు.

కలెక్టర్ సహాయక చర్యల పర్యవేక్షణ

జిల్లాలోని వరద ప్రభావం అధికంగా ఉన్న చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ గత ఆరు రోజులుగా పర్యటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది చేపడుతున్న వరద సహాయక, పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని ప్రజలతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీస్తున్నారు. చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి చింతూరు, కూనవరం, వీఆర్.పురం, ఎటపాక మండలాల్లో చేపడుతున్న వరద సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు. జిలాలో వరదల ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు ఘాట్ మార్గాల్లో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల నిషేధం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. జిల్లాలో పాడేరు రెవెన్యూ డివిజన్‌లో గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా ప్రాంతాల్లోని గిరిజనులు గెడ్డలు దాటవద్దని, సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని, చింతూరు డివిజన్ పరిధిలోని వరద బాధితులు సహాయక, పునరావస చర్యలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం

గూడెంకొత్తవీధి: మండల కేంద్రం సాంబారిదేవి దేవాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం ఏళ్ల నాటి భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలిపడింది. దీంతో సీలేరు-చింతపల్లి మార్గంలో సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజన ప్రాంతంలో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూమి మొత్తబడిపోవడంతో సాంబారిదేవి ఆలయం ఎదురుగా ఉన్న భారీ మామిడి వృక్షం నేలకొరిగింది. ఆ సమయానికి ఎటువంటి వాహనాలు రాకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. స్థానిక ఎస్ఐ అప్పలసూరి, పోలీసులు జోక్యం చేసుకుని వృక్షాన్ని తొలగించడంతో గంట తరువాత యథావిధిగా రాకపోకలు సాగాయి.



ముంచంగిపుట్టు మండలం దొరగూడ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

లంబసింగి రహదారిలో..

చింతపల్లి: మండలంలోని తాజంగి- లంబసింగి ప్రధాన రహదారి బ్రిటీష్ అతిథి గృహం వద్ద బుధవారం ఉదయం భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలి పడింది. దీంతో నాలుగు గంటల పాటు ఈ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. చెట్టుతో పాటు రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారికి అడ్డంగా పడి వున్న చెట్టును తొలగించాలని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులకు తహసీల్దార్ టి.రామకృష్ణ సమాచారం ఇచ్చారు. దీంతో చింతపల్లి ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఏఎస్ఐ సన్యాసిరావు, ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ అధికారులు కలిసి మధ్యాహ్నం 12గంటలకు వృక్షాన్ని తొలగించారు. దీంతో ఈ మార్గంలో యథావిధిగా రాకపోకలు సాగాయి. అలాగే ఈపీడీసీఎల్ అధికారులు విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఇంటిపై పడిన జీరుగు చెట్టు

మండలంలోని అంతర్ల గ్రామంలో బుధవారం ఉదయం కంకిపాటి కాంత కుమారి ఇంటిపై జీరుగు చెట్టు కూలి పడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే ఇంటి ఓ భాగం గోడలు, పైకప్పు దెబ్బతిన్నాయి. అలాగే కిన్నెర్ల రామ్‌నగర్ కాలనీలో వర్షాలకు గెమ్మెలి సీత ఇంటి గోడలు కూలిపోయాయి.

హుకుంపేటలో..

హుకుంపేట: మండంలో బుధవారం పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. అడ్డుమండ ప్రధాన రహదారిలో ఈదురుగాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. స్థానికుల సహాయంతో ఈ వృక్షాన్ని తొలగించారు.

ధారకొండ గుమ్మిరేవుల రోడ్డులో..

సీలేరు: జీకేవీధి మండలం ధారకొండ గుమ్మిరేవుల రహదారిలో వర్తుండపాడు వద్ద భారీ వృక్షం మంగళవారం విరిగిపడడంతో ధారకొండ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం మధ్యాహ్నం వరకు ఆర్ అండ్ బీ అధికారులు, పోలీసులు స్పందించలేదు. దీంతో స్థానికులు భారీ చెట్టును నరికి రోడ్డుపై అడ్డంకిని తొలగించారు.

అరకులోయలో..

అరకులోయ: మండలంలో బుధవారం వర్షం కొనసాగింది. దీంతో జనజీవనానికి ఆటంకం కలిగింది. చిరు వ్యాపారాలు మూతపడ్డాయి. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండల పరిధిలో బుధవారం వర్షం బీభత్సం సృష్టించింది. ఎడతెరిపి లేకుండా వర్షంతో పాటు ఈదురు గాలులు వీచాయి. ఈదురుగాలులకు మంగళవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో ఎంపీడీవో క్వార్టర్స్ సమీపంలో పనస చెట్టు నేలకొరిగింది. రెండు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేదు. గాలులకు గత మూడు రోజులుగా విద్యుత్ వచ్చిపోతుంది. అయితే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది జోరువానలో గంటల తరబడి శ్రమించి సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే 23 పంచాయతీల పరిధిలో వాగులు, గెడ్డలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, ఉబ్బెంగుల సమీపంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడం వల్ల పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

జి.మాడుగులలో..

జి.మాడుగుల: మండలంలోని తాడిపీధి గ్రామంలో బుధవారం ఉదయం వర్షాలకు తల్లాబు రాజయ్య అనే గిరిజనుడి ఇంటి గోడ కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలకు సమీపంలో గోడ పెళ్లలు పడ్డాయి. అయితే అదృష్టవశాత్తూ వారికి ఎటువంటి గాయాలు కాలేదు.



జీకేవీధిలో రహదారికి అడ్డంగా పడిన వృక్షాన్ని తొలగిస్తున్న పోలీసులు

వరద నష్టాలపై పూర్తి సమాచారం సేకరించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

పాడేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరద ప్రభావిత గ్రామాల్లో జరిగిన నష్టాలపై పూర్తి సమాచారం సేకరించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలోని చింతూరు ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులతో బుధవారం సాయంత్రం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అధికారులు గుర్తించిన వరద బాధితులకు పూర్తి స్థాయిలో నిత్యావసర సరకులు అందించాలని, గురువారం నాటికి పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కూనవరం వెళుతున్న రోడ్డు తెగిపోయిందని, అది మినహా మిగిలిన అన్ని రోడ్లు వినియోగంలో ఉన్నాయని, ట్రాక్టర్లు ద్వారా అన్ని గ్రామాలకు సరకులు చేరవేసి పంపిణీ చేయాలన్నారు. బాధితులు దోమతెరలు అడుగుతున్నారని, కాకినాడ, విశాఖపట్నం నుంచి సేకరిస్తున్నామని వాటిని వారికి అందించేందుకు రెండు రోజులు పడుతుందన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా నీటి సరఫరా చర్యలు చేపట్టాలని, అరకొరగా నీటి సరఫరా చేస్తే సమస్యలు వస్తాయన్నారు. తాగునీటిని వేడి చేసుకుని వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఇంటికి 10 క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని, తాగునీటిలో క్లోరిన్ మాత్రలు కలుపుకొని తాగడంపై అవగాహన కల్పించాలన్నారు. నిత్యావసర సరకులు, డీజిల్, కిరోసిన్, పెట్రోలు దుర్వినియోగం జరగకుండా అధికారులు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పలు చోట్ల వైరల్ ఫీవర్లు నమోదవుతున్నాయని, వైద్య సిబ్బంది మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రానున్న 12 గంటల్లో గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జే.అభిషేక్, రంపచోడవరం, పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, వి.అభిషేక్, కావూరి చైతన్య, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

కూనవరం, వీఆర్ పురం వరద బాధితులకు సహాయక చర్యలపై ఆరా


పాడేరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కూనవరం, వీఆర్ పురం మండలాల్లోని ముంపు ప్రాంతాల్లోని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం పర్యటించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలు నీట మునిగి ఉండడంతో ట్రాక్టర్, బోటులో ప్రయాణించి వరద బాధితుల వద్దకు చేరుకున్నారు. తొలుతగా కూనవరం మండలం జీడిగుప్ప, రాయిగూడెం గ్రామాలను సందర్శించి అక్కడ వరద బాధితులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తమ వెంట బోటులో తీసుకువెళ్లిన కూరగాయాలు, నూనె వంటి సామగ్రిని బాధితులకు పంపిణీ చేశారు. తరువాత మునకలపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ తాత్కాలిక నివాసంలో ఉంటున్న బాధితులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సహాయక, పునరావాస చర్యలపై ఎటువంటి సమస్యలున్నా తక్షణమే కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు.

బాధితులకు ఇబ్బందులు తలెత్తకూడదని ఆదేశం

చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కూనవరం, చింతూరు, వీఆర్.పురం, ఎటపాక మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లో బాధితులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కూనవరం, వీఆర్.పురం పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడారు. వరద బాధితులకు పూర్తి స్థాయిలో సహాయక, పునరావాస చర్యలు చేపట్టేందుకు అన్నీ సిద్ధంగా ఉన్నాయని, వాటిని ఉపయోగించి అధికారులు, సిబ్బంది ప్రజలకు సమస్యలు తలెత్తకుండా సేవలు అందించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో గర్భిణులుంటే తక్షణమే సమీపంలోని ఆస్పత్రులకు తరలించాలని, అంగన్‌వాడీ బాలలకు సక్రమంగా పోషకాహారం అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వరద సహాయక, పునరావాస చర్యలు చేపట్టడంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్ , సూరజ్‌గనోరే, కావూరి చైతన్య, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు రెవెన్యూ డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు వున్నారు.



మునకలపల్లిలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్



పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలో ఉన్న డొంకరాయి జలాశయం

రిజర్వాయర్లు కళకళ

పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలో డొంకరాయి

అదే స్థాయిలో గుంటవాడ


సీలేరు, జూలై 24: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 1035 అడుగులకు చేరింది. ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కావడంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో ఈఈ పి.విజయకుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం డొంకరాయి జలాశయానికి వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగులతో పాటు సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం వచ్చే నీటితో కలిపి 8 వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నదన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయం 1035 అడుగుల వద్దకు చేరుకోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. ఈ మేరకు సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి జలాశయం నీటి నిల్వలను పరిశీలించారన్నారు. మంగళవారం రాత్రి నుంచి వర్షం తగ్గుముఖం పట్టడంతో వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టవచ్చునని భావిస్తున్నామన్నారు. ఇన్‌ఫ్లో అదే రీతిలో (8 వేల క్యూసెక్కులు) కొనసాగినట్టయితే బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి జలాశయంలో నీటిమట్టం 1036 అడుగులకు చేరుకోవచ్చునని అంచనా వేస్తున్నామని చెప్పారు. 1036 అడుగులకు నీటిమట్టం చేరితే రెండు గేట్లు ద్వారా ఒక్కొక్క అడుగు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, దీనిపై ఉన్నతాధికారులకు కూడా సమాచారం ఇచ్చామని ఈఈ తెలిపారు. అలాగే పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి పవర్ కెనాల్ ద్వారా 2220 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

సీలేరు కాంప్లెక్సులోని జలాశయాల ప్రస్తుత నీటి నిల్వలు

జలాశయాలు	పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నీటిమట్టం (అడుగుల్లో)
జోలాపుట్	2,750	2,723.20
బలిమెల	1,516	1,470.50
గుంటవాడ	1,360	1,358.40
డొంకరాయి	1,037	1,035.00

గుంటవాడ జలాశయం వద్ద..

సీలేరు కాంప్లెక్సులోని గుంటవాడ జలాశయంలో 1358.4 అడుగుల నీటి నిల్వలు క్రమంగా కొనసాగుతున్నాయి. ఇక్కడ పూర్తిస్థాయి ... మిగతా 8వ పేజీలో



నిండుకుండలా గుంటవాడ జలాశయం

రక్తహీనతతో గిరిజన విద్యార్థి మృతి

డుంబ్రిగుడ, జూలై 24: మండలంలోని సోవ్వా ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి రక్తహీనతతో బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సోవ్వా ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మాస్ లాజర్(13) ఏడవ తరగతి చదువుతున్నాడు. ఆరోగ్యం బాగోకపోవడంతో స్వగ్రామం గసభలో తల్లిదండ్రుల చెంతనే ఉంటున్నాడు. ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో తల్లిదండ్రులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం ఆ బాలుడు మృతి చెందాడు.

పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రక్తహీనతతో బాధపడుతున్న గిరిజన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామారావు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాశరథిని వివరణ కోరగా గతేడాది ఆ బాలుడు ఆరవ తరగతిలో చేరి మధ్యలో బడి మానేశాడన్నారు. ఈ ఏడాది పాఠశాల పునః ప్రారంభానికి ముందు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఆ బాలుడి స్వగ్రామానికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించామన్నారు. ఆ విద్యార్థి ఈ ఏడాదిలో ఒక్క రోజు కూడా పాఠశాలకు హాజరు కాలేదని ఆయన తెలిపారు.

క్రైం... crime news

నమ్మకంగా పనిచేస్తున్నట్టు నటించి రూ.4 కోట్లు స్వాహా

- యజమాని అకౌంట్ నుంచి తన అకౌంట్‌కు నగదు బదిలీ చేసుకున్న ప్రబుద్ధుడు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- ప్రత్యేక బృందాలతో నిందితుడి కోసం గాలింపు

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి):పదేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నాడని సంస్థ అకౌంట్ల నిర్వహణ, ఆడిట్ బాధ్యతలను అప్పగిస్తే ఏకంగా రూ.4 కోట్లు స్వాహా చేశాడు. అనారోగ్యం నుంచి కోలుకున్న యజమాని మోసాన్ని గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదుచేశారు. నిందితుడు పరారీలో ఉండడం తో ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. దీనికి సంబంధించిన ఫిర్యాదుదారుడు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి...బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన సీహెచ్ రాధాకృష్ణమూర్తి (80) ఇరవై ఏళ్ల కిందట విశాఖలో స్టోన్‌క్రషర్, రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీలోని తన ఇంటి నుంచే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేవారు. ఈ క్రమంలో తన వ్యాపారానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల నిర్వహణ, ఆడిట్‌కు సంబంధించిన వ్యవహారాలు, ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయడం వంటి పనులు చక్కబెట్టేందుకు నర్సీపట్నం సమీపంలోని తంగేడుకు చెందిన చిటికెల గోవింద్‌ను 2010లో అకౌంటెంట్‌గా తీసుకున్నారు. రాధాకృష్ణమూర్తికి 2016లో గుండె సంబంధిత సమస్య తలెత్తడంతో వైద్యం నిమిత్తం గుంటూరు వెళ్లారు. కోలుకుని తిరిగి విశాఖ రావాలనుకుంటున్న సమయంలో కంటి చూపుతోపాటు మరికొన్ని ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో తన కుమార్తెకు వ్యాపార వ్యవహారాలు అప్పగించారు. ఆమె తరచూ నగరానికి రాలేకపోవడంతో గోవింద్ ద్వారానే వ్యాపారాన్ని సాగించేవా రు. కొన్నాళ్ల కిందట స్టోన్ క్రషర్‌ను రూ.3.36 కోట్లకు విక్రయించేయడంతో ఆ మొత్తాన్ని రాధాకృష్ణమూర్తి బ్యాంకు ఖాతాలో కొంత, ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మరికొం త ఉంచారు. దీంతోపాటు మరో రూ.64 లక్షలు విలువై న డిపాజిట్లు రాధాకృష్ణమూర్తి పేరుతో ఉన్నాయి. రాధాకృష్ణమూర్తి అనారోగ్యం పాలవ్వడం, ఆయన కుమార్తె పూర్తిస్థాయిలో వ్యాపారంపై దృష్టిపెట్టలేకపోవడాన్ని గోవింద్ అవకాశంగా తీసుకున్నాడు. తన పేరుతో ఒక సేవింగ్ అకౌంట్, రియల్ ఎస్టేట్ సంస్థ ఏర్పా టుచేసి కరెంట్ అకౌంట్ ఒకటి ఓపెన్ చేశాడు. రాధాకృష్ణమూర్తి అకౌంట్‌లోని నగదుతోపాటు ఫోర్జరీ చెక్ లతో రామకృష్ణమూర్తి పేరిట ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల ను దశల వారీగా తన బ్యాంకు ఖాతాలకు, స్నేహితు లు, కుటుంబసభ్యుల ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. రాధాకృష్ణమూర్తి ఈ విషయాన్ని గుర్తించకపోయారు. ఇదిలావుండగా ఈ ఏడాది ఏప్రిల్ 14న పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ నుంచి రాధాకృష్ణమూర్తికి ఫోన్ వచ్చింది. అకౌంటెంట్ చిటికెల గోవింద్ కనిపించడం లేదని అతని భార్య ఫిర్యాదు చేసిందని చెప్పడంతో ఆయన అవాక్కయ్యారు. వెంటనే అనుమానంతో నగరానికి వచ్చి తన బ్యాంకు అకౌంట్లలోని నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాల గురించి అధికారులను ఆరా తీశారు. నగదు గోవింద్ పేరుతో ఉన్న అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను చెక్ ద్వారా దశల వారీగా విత్‌డ్రా చేసుకున్నట్టు బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో గోవింద్ తనను మోసం చేసినట్టు గుర్తించిన రాధాకృష్ణమూర్తి అదే నెల 24న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గోవింద్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. గోవింద్ కోసం పోలీసులు గాలించినా ఆచూకీ లేకపోవడంతో కేసు దర్యాప్తు ఆగిపోయింది. ఈలోగా రామకృష్ణమూర్తి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రిలో చేరారు. కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలంటూ రాధాకృష్ణమూర్తి కుటుంబసభ్యులు ఈనెల 21న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చిని కలిసి విజ్ఞప్తిచేశారు. దీనిపై స్పందించిన సీపీ నిందితుడి ఆచూకీని కనిపెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని, ప్రత్యేక బృందాలతో గాలించాలని ఎంవీపీ పోలీస్ స్టేషన్ సీఐ సంజీవరావును ఆదేశించారు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో పరారీలో ఉన్న గోవింద్ కోసం గాలింపు మొదలుపెట్టారు.

సైబర్ నేరస్థుడి అతి తెలివి

- అనకాపల్లికి చెందిన వ్యక్తి అకౌంట్ నుంచి మరో ఖాతాకు రూ. 2.81 లక్షలు బదిలీ
- పనిచేయని సిమ్‌ను బ్లాక్ చేసి మరీ మోసం
- కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు

అనకాపల్లి టౌన్, జూలై 24 : పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బ్యాంక్ అకౌంట్ నుంచి వేరొక బ్యాంక్ ఖాతాకు గుర్తుతెలియని వ్యక్తి రూ.2.81 లక్షలు బదిలీ చేసిన సంఘటనపై బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాలివి. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌కు చెందిన మళ్ల వెంకటగిరిధర్ సెల్‌ఫోన్ సిమ్ గత నెల 14వ తేదీ నుంచి పనిచేయడం లేదు. గుర్తు తెలియని వ్యక్తి తన తెలివితేటలతో సిమ్‌ను బ్లాక్ చేసి, ఫిర్యాదు పేరు మీదే కొత్త సిమ్‌ను వేసి గత నెల 16వ తేదీన ఒక బ్యాంక్ నుంచి నగదును వేరొక అకౌంట్‌కు మళ్లించాడు. ఆ మర్నాడు బాధితుడు కొత్త సిమ్‌ను వేసి బ్యాంక్ అకౌంట్ చూడగా, అందులో నగదు వేరొక అకౌంట్‌కు బదలాయించినట్టు గుర్తించాడు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీ

నక్కపల్లి, జూలై 24 : మండల కేంద్రం నక్కపల్లిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలివి. వీవర్స్ కాలనీకి చెందిన కోమాకుల సత్యనారాయణ తన భార్యతో కలిసి మూడు రోజుల కిందట జోగంపేటలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ తన ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచి ఉండడాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి చూడగా, బీరువాలో భద్రపర్చిన రెండు బంగారు తాళ్లు, ఉంగరాలు, చైన్లు వంటి ఆభరణాలు మొత్తం ఏడు తులాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సాయంత్రం చోరీ జరిగిన ఇంటిని సీఐ విజయ్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎస్.రాయవరం, జూలై 24 : మండలంలోని ధర్మవరం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై బుధవారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న కారు ధర్మవరం అగ్రహారం వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నప్పటికీ అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



ధర్మవరం అగ్రహారం వద్ద బోల్తా పడిన కారు

గంజాయి కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

కొత్తూరు/లంకెలపాలెం, జూలై 24 : అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన నీలకాయల మోహన్‌కు గంజాయి కేసులో నాలుగు సంవత్సరాల ఐదునెలల కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానాను కోర్టు విధించినట్టు జిల్లా ఎస్పీ ఎం.దీపిక బుధవారం తెలిపారు. 2020 జనవరి 24న పరవాడ పోలీసు స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ గోపి తన సిబ్బందితో కలిసి లంకెలపాలెం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారన్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బ్యాగ్‌తో ఉన్న వ్యక్తి తప్పించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు పట్టుకున్నారన్నారు. దీంతో ఆ బ్యాగులో తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి పట్టుబడినట్టు చెప్పారు. దీనిపై విచారణ పూర్తి చేసిన అనంతరం 10వ అదనపు జడ్జి కోర్టులో జడ్జి నందనవనం శ్రీవిద్య ముద్దాయి మోహన్‌కు బుధవారం పై విధంగా శిక్ష విధించినట్టు ఎస్పీ పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

సమస్యల సుడిలో మెట్టపాలెం వసతి గృహం

శిథిలావస్థకు చేరిన భవనం

- సింహాద్రి ఎన్టీపీసీ నిర్మించిన హాల్‌లోనే ఉంటున్న 60 మంది విద్యార్థినులు
- చాలీచాలని వసతులతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



పైకప్పు నుంచి పెచ్చులూడి బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు

పరవాడ, జూలై 24: మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో గల మెట్టపాలెం ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది.. ఇక్కడ మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 60 మంది బాలికలు ఉన్నారు. భవనం దుస్థితిని చూసి వారంతా భయం భయంగా గడుపుతున్నారు. భవనం శ్లాబు నుంచి పెద్ద పెద్ద పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ శిథిల భవనాన్ని వదిలేసి పక్కనే సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో ఒక గది (హాల్) నిర్మించింది. అందులో విద్యార్థులు ఉంటూ నెట్టుకొస్తున్నారు. అది ఏ మాత్రం సరిపోవడం లేదని వారంతా చెబుతున్నారు. పాత భవనం తొలగించి దాని స్థానంలో కొత్తది నిర్మించేందుకు గతంలోనే ఇంజినీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. ఇప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. ప్రస్తుతం భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శ్లాబు, సన్‌షేడ్, పిల్లర్స్ నుంచి పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. భవనంలోని పలు గదులు వర్షానికి కారిపోతున్నాయి. కిటికీలు ఊడిపోయాయి. వంటగది ప్రమాదకరంగా మారడంతో రేకుల షెడ్డులో నెట్టుకొస్తున్నారు. సింహాద్రి యాజమాన్యం నిర్మించిన ఒక్క గదిలోనే వార్డెన్‌తో పాటు 60 మంది బాలికలు ఉంటున్నారు. ఇది ఏ మాత్రం వారికి సరిపోవడం లేదు. ఇరుకు గదిలోనే తప్పనిసరిగా ఉండాల్సి వస్తుంది. విద్యార్థినులకు చెందిన సామగ్రిని ఉంచుకోవడంతో పాటు అందులోనే చదువుకోవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు ఉన్నప్పటికీ స్థలం సరిపోకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. గత్యంతరం లేక నేల మీదే పడుకుంటున్నారు. ఇక్కడ మరుగుదొడ్లకు, బాత్‌రూములకు రన్నింగ్ వాటర్ సౌకర్యం లేదు. మోటారు వద్ద ఉన్న ట్యాంక్ నుంచి నీటిని బకెట్లతో పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే వసతి గృహంలో గల మినీ మినరల్ ట్యాంక్ మూలకు చేరింది. దీనికి మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో కుళాయిలు, మోటార్ల ద్వారా వచ్చే నీటిని తాగుతున్నారు. వసతి గృహంలో సమస్యల కారణంగా విద్యార్థినుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



సన్‌షేడ్ దెబ్బతినడంతో...



శిథిలమైన భవనం పిల్లర్ అడుగు భాగం



శిథిలావస్థలో ఉన్న మెట్టపాలెం బీసీ బాలికల వసతిగృహం

కల్యాణపు లోవకు కొనసాగుతున్న వరద ప్రవాహం

- రెండు గేట్లు తెరిచి 100 క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, జూలై 24 : మండలంలో కల్యాణపు లోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో రిజర్వాయ్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి వంద క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నామని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. జలాశయ సామర్థ్యం 460 అడుగులు కాగా, బుధవారం నాటికి 459.10 అడుగుల వరకు నీటి మట్టం చేరిందన్నారు. ఈ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో ఎగువన విస్తరంగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో 75 క్యూసెక్కుల మేర జలాశయంలోకి వస్తుండంతో రిజర్వాయర్ నీటి మట్టం పెరుగుతూ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి విడిచిపెడుతూ నీటి మట్టాన్ని స్థిరీకరిస్తున్నామని ఏఈ తెలిపారు. ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నందున ఈ నెల 15 నుంచి ఇంతవరకూ జలాశయంలో వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఐదు సార్లు గేట్లు ఎత్తినట్టు చెప్పారు. మంగళవారం ఉదయం నీటి మట్టం తగ్గడంతో ఎత్తిన గేట్లు క్లోజ్ చేయగా జలాశయ ఎగువన కురుస్తున్న వర్షాలకు మళ్లీ బుధవారం సాయంత్రం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర నీటిని విడిచి పెడుతున్నామన్నారు. సర్పానది పరీవాహక మూడు మండలాల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తిన కారణంగా సర్పానదిలో నీటి ప్రవాహం బాగా పెరుగుతుందన్నారు. అందుకే నదిని దాటి వెళ్లే ప్రయత్నాలు వంటివి చేయవద్దని ఏఈ సూచించారు.



కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి నీరు విడిచి పెడుతున్న దృశ్యం

జీవీఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

- ప్రధాన కార్యాలయంలో ప్రతి విభాగం పరిశీలన
- మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం
- 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?'... అంటూ కార్యాలయం ఇన్‌చార్జిపై అసహనం
- ముఖ్యమైన ఫైళ్లను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులకు ఆదేశం
- ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలని సూచన

విశాఖపట్నం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్ బుధవారం కార్యాలయంలోని అన్ని విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు వినియోగించే మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యాలయం ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వరరావును పిలిచి 'మీరైతే ఇలాంటి మరుగుదొడ్డిని వాడతారా?' అని ప్రశ్నించారు. కార్యాలయ ఆవరణతోపాటు మరుగుదొడ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంలో కారిడార్‌కు ఇరువైపులా ఇనుప బీరువాల్లో ఫైళ్లను ఉంచడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఫైళ్లను ఎవరైనా తస్కరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ముఖ్యమైన, అవసరమైన ఫైళ్లను కార్యాలయంలోనే భద్రపరిచి, మిగిలిన ఫైళ్లను జోన్-4 కార్యాలయానికి తరలించి కారిడార్‌ను ఖాళీ చేయాలని సూచించారు. కార్యాలయంలోకి గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది పనిచేసేందుకు అవసరమైన వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఖాళీ ప్రదేశాల్లో మంచి నీడను ఇచ్చే మొక్కలను నాటాలని హార్టికల్చర్ డీడీ దామోదర్‌కు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన జీవన పరిస్థితులు కల్పించడంతోపాటు, వారి సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర సమాచారాన్ని నగర ప్రజలకు తక్షణం చేరవేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరిపాలన, యూసీడీ విభాగంతోపాటు అకౌంట్స్, ఐటీ విభాగాలను కమిషనర్ పరిశీలించారు. తాను మరోసారి తనిఖీ చేస్తానని అప్పటికి పరిస్థితులన్నీ మెరుగుపడాల్సిందేనని స్పష్టంచేశారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్‌వర్మ, ఎస్ఈలు, వేణుగోపాల్, వినయ్‌కుమార్, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు

గొలుగొండ, జూలై 24 : సంచిలో రెండు కిలోల గంజాయి తరలిస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. బుధవారం మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కాలినడకన వెళుతున్న బాలుడి సంచి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ సభ్యత్వాలను తీసుకోవాలి

- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బాబూరావు

కె.కోటపాడు, జూలై 24 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ అసోసియేషన్ సభ్యత్వాలను తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బాబూరావు కోరారు. అసోసియేషన్ సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం ఆయన స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులను కలిసి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా సబ్-రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కె.కోటపాడు తాలుకా ఎన్నికలు ఈ నెల 29న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న బాబూరావు తదితరులు

అప్పన్నను దర్శించుకున్న అమరావతి రైతులు



దేవస్థానం ఎదుట రైతులు

సింహాచలం, జూలై 24 : వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాత్రి అమరావతి ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది రైతులు దర్శించుకున్నారు. ఎన్నికల్లో చంద్రబాబునాయుడు విజయం సాధించి, ముఖ్యమంత్రి కావాలని మొక్కుకున్నామని, అది తీర్చుకునేందుకు స్వామివారిని దర్శించుకున్నట్టు వారు తెలిపారు. గురువారం ఉదయం అరసవల్లిలో సూర్యనారాయణస్వామిని దర్శించుకుని ఆలయ ఆవరణలో 108 సార్లు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం చేయనున్నట్టు చెప్పారు.

ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో గాలం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు టోకరా
- రూ.22 లక్షలు దోచేసిన కిలాడీ లేడీ
- హైదరాబాద్‌కు చెందిన యువతిగా గుర్తింపు
- అరెస్టు చేసి రిమాండుకు తరలించిన సైబర్‌క్రైమ్ పోలీసులు

ఎండాడ, జూలై 24 : ఫేక్ అకౌంట్‌తో ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి ఓ కిలాడీ లేడీ ఏకంగా రూ.22 లక్షలు దోచేసింది. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. సైబర్‌క్రైమ్ సీఐ కె.భవానీప్రసాద్ తెలిపిన వివరాల మేరకు...

హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియ అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీని క్రియేట్ చేసింది. మ్యాట్రిమోనీ సైట్లలో రిజిస్టర్ చేసుకున్న యువకుల వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో వారితో పరిచయం పెంచుకునేది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారి నుంచి డబ్బులు గుంజేది. ఈ క్రమంలో విశాఖ నగరానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం చేసుకుంది. అతని వాట్సాప్ నంబరును సేకరించి, అందమైన అమ్మాయిల ఫొటో పంపి చాటింగ్ చేసింది. అతడి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, ఎమోషనల్‌గా దగ్గర అయినట్టు నటించింది. డబ్బులు అత్యవసరమంటూ అతని నుంచి రూ.22 లక్షలు తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకుంది. ఆ తరువాత ఆమె ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోవడంతో బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంకేతికతను వినియోగించిన సైబర్‌క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన బత్తిన సాయిప్రియగా గుర్తించి, ఆమెను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

పీఏసీఎస్ నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టాం

- నిధుల దుర్వినియోగం అయినట్టు నిర్ధారణ అయితే తదుపరి చర్యలు
- జిల్లా సహకార అధికారి స్వరూపరాణి



జానకిరామపూరం పీఏసీఎస్ కార్యాలయం

నర్సీపట్నం, జూలై 24 : జానకిరామపురం పీఏసీఎస్‌లో సీఈవో నిధులు దుర్వినియోగం వాస్తవమని నిర్ధారణ అయితే తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార శాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొనారు. ఈ నెల 22న 'పీఏసీఎస్‌లో రూ.2 కోట్లు గోల్‌మాల్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. పీఏసీఎస్‌లో నిధులు దుర్వినియోగంపై సమాచార శాఖ ఏడీకి, జిల్లా కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. ఈ ఏడాది మే 14న జానకిరామపురం పీఏసీఎస్‌లో నిధులు దుర్వినయోగంపై డీసీసీబీ సీఈవో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎలమంచిలి డీఎల్‌సీవో ఈనెల 10న అసిస్టెంట్ రిజిస్టర్ ఎస్.సత్యనారాయణతో ప్రాథమిక విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఈ నెల 11న ఎలమంచిలి డీఎల్‌సీవోకు నివేదికను అందజేశారని పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా సెక్షన్ 52 విచారణకు ఈ నెల 19న అసిస్టెంట్ రిజిస్టర్ ఐవీ రమణమూర్తిని నియమించడం జరిగిందని తెలిపారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ అయితే సీఈవోపై తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

27న ప్రభుత్వ ఐటీఐలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

పాయకరావుపేట, జూలై 24 : ఇక్కడి ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రెండో విడత అడ్మిషన్ల కొరకు ఈనెల 27వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల వద్ద హాజరుకావాల్సిందిగా ఆయన కోరారు.

26న తాండవ నీరు విడుదలపై సమావేశం

నాతవరం, జూలై 24 : ఈ నెల 26న తాండవ నీరు విడుదలపై తాండవ ఆయకట్టు రైతులతో నాతవరం తాండవ ప్రాజెక్టు సెక్షన్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు డీఈ అనురాధ తెలిపారు. ఖరీఫ్‌కు నీరు ఎప్పుడు విడుదల చేస్తే బాగుటుందన్న విషయమై తాండవ ఆయకట్టు రైతులు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోని వారి అభీష్టం మేరకు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- అల్లూరి యువజన సంఘు వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు



వీరభద్రరావు

నర్సీపట్నం అర్బన్ జూలై 24 : నర్సీపట్నంలో గల కవర్డ్, హైటర్ల సమాధుల స్థలాన్ని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్టు అల్లూరి యువజన సంఘ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నంలో బ్రిటీష్ సేనానులు కవర్డ్, హైటర్ల సమాధులు అల్లూరి సాక్ష్యంగా నిలిచి నర్సీపట్నంలో ప్రధాన రహదారి పక్కన యాభై సెంట్లు స్థలం ఉందన్నారు. ఈ స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తే గోడ నిర్మాణానికి అల్లూరి యువజన సంఘం ముందుకు వస్తుందన్నారు.

రైళ్లు మళ్లింపు, గమ్యం కుదింపు

విశాఖపట్నం, జూలై 24: పూణే డివిజన్‌లో ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో లోకమాన్య తిలక్ టెర్మినస్ నుంచి విశాఖ వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520) ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు వయా మిరాజ్, కుర్దువాడి మీదుగా నడుస్తుందని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, భువనేశ్వర్-పూణే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22882) ఈనెల 30న భువనేశ్వర్ నుంచి సోలాపూర్ వరకు, తిరుగు ప్రయాణంలోని పూణే - భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22881) ఆగస్టు ఒకటో తేదీన సోలాపూర్‌లో బయలుదేరి భువనేశ్వర్ చేరుతుందని తెలిపారు. సోలాపూర్, పూణే మధ్య రాకపోకలు రద్దు చేసినట్టు వివరించారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియమకానికి ఇంటర్వ్యూలు రేపు

ఎలమంచిలి, జూలై 24 : పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి సంబంధించి ఈనెల 26వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కెమిస్ట్రీలో పీజీ కోర్సులు బోధించేందుకు ఇద్దరు అధ్యాపకులు, కంప్యూటర్ సైన్స్ యూజీ కోర్స్ బోధించేందుకు ఇద్దరు అధ్యాపకులు అవసరంగా పేర్కొన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ లేదా ఎంసీఏలో 55 శాతం మార్కులు పొంది నెట్ లేదా పీహెచ్‌డీ కలిగి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో శుక్రవారం కళాశాలలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.


జర్జులలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

పంట నష్టంపై పూర్తి అంచనాకు చర్యలు: జిల్లా వ్యవసాయాధికారి నందు

ముంచంగిపుట్టు, జూలై 24: భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో వ్యవసాయాధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌బీఎస్ నందు ఆదేశించారు. మండలంలోని జర్జుల, బొదిలిగూడ, సంతవీధి, కులబీరు, గుర్రాలబయలు, పెద్దాపుట్టు, కడుతుల, పోలిపుట్టు, మొంజాపుట్టు తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ముంచంగిపుట్టు మండలంలోని 25 గ్రామాల్లో ఇప్పటివరకు 280 హెక్టార్ల మేరకు దెబ్బతిన్న పంటలను గుర్తించినట్టు చెప్పారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయని, వర్షాలు తగ్గిన వెంటనే పూర్తి స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అలాగే పంట నష్టం వాటిల్లిన రైతులు లిఖిత పూర్వకంగా సంబంధిత అధికారులకు వివరాలు అందిస్తే పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాస్, పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

▸▸ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యకుమారి


పెదబయలు అంగన్‌వాడీ కేంద్రం-1 భవనాన్ని పరిశీలిస్తున్న పీడీ

పెదబయలు, జూలై 24: బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు స్థాయిలో బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వివాహ వయస్సు రాకముందే పెళ్లిళ్లు చేసుకోవడం చట్ట విరుద్ధమన్నారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు వయస్సుకు రాని పిల్లలకు వివాహం చేయాలనుకుంటే వ్యతిరేకించాలని, వెంటనే ఐసీడీఎస్, పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. అలాగే తాకకూడని చోట ఎవరైనా తడిమితే భయపడకుండా 'డోంట్ టచ్ మీ' అని గట్టిగా అరవాలన్నారు. అనంతరం పెదబయలు మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం-1 భవనాన్ని సందర్శించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహార కిట్‌ను సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో వరహమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిఖిల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి

▸▸ ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి


ఏవోలు, శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్

చింతపల్లి, జూలై 24: ఆదివాసీ రైతులు వర్షాల నుంచి పంటలను సంరక్షించుకునేందుకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. జిల్లాలోని వ్యవసాయాధికారులతో బుధవారం వర్చువల్ పద్ధతిలో ట్రైనింగ్ అండ్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా పంట పొలాలను సందర్శిస్తూ నష్టాన్ని అంచనా వేయడం జరుగుతుందన్నారు. అలాగే పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్నట్టు చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అనంతరం వివిధ మండలాల్లో వరి నారుమడులు, పంట పొలాలు, ఇతర పంటల తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి, డాక్టర్ ఉజ్వలరాణి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ తేజేశ్వరరావు పాల్గొన్నారు.

డుడుమ జలపాతాలకు పర్యాటకుల తాకిడి


డుడుమ జలపాతం వ్యూ పాయింట్ వద్ద రద్దీగా ఉన్న పర్యాటకులు

ముంచంగిపుట్టు, జూలై 24: ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం డుడుమ జలపాతాల వద్ద బుధవారం పర్యాటకుల తాకిడి ఎక్కువగా కనిపించింది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతాలు వరద నీటితో ఉరకలేస్తూ ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతాలను చూసేందుకు ఇరు రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. డుడుమ జలపాతంతో పాటు జల విద్యుత్ కేంద్రం వ్యూ పాయింట్ పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే వర్షంఆగకపోవడంతో జలపాతాలపై నీలి మేఘాలు ఎక్కువ సమయం కమ్ముకొని ఉంటున్నాయి. దీంతో ప్రస్తుతం రెండు జలపాతాలు మాత్రమే కనిపిస్తున్నాయి. మూడో జలపాతం కనిపించకపోవడంతో పర్యాటకులు కాస్త నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

ఈఎంఆర్ ప్రిన్సిపాల్ అన్నామణికి సత్కారం


ప్రిన్సిపాల్ అన్నామణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చింతపల్లి, జూలై 24: రంపచోడవరం గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్తున్న ఈఎంఆర్ ప్రిన్సిపాల్ అన్నామణిని బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈఎంఆర్ పాఠశాల ఏర్పాటు నుంచి ప్రిన్సిపాల్‌గా అన్నామణి చేశారని, పాఠశాల పురోగతికి ఆమె కృషి మరువలేమని ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు ఎం.లోవ రాజు అన్నారు. సన్మానకర్త మాట్లాడుతూ తన సర్వీసులో చింతపల్లి ఈఎంఆర్ పాఠశాలలో పనిచేసిన కాలం ఎన్నడూ మర్చిపోలేనన్నారు. కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, అధ్యాపకుడు ఐజక్, ఉపాధ్యాయుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

తాడు పట్టాలి.. గెడ్డ దాటాలి!

▸▸ యు.చీడిపాలెంలో ప్రమాదకరంగా వాగులు

▸▸ ఉధృత ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం

▸▸ తాడు ఆధారంగా బిక్కుబిక్కుమంటూ ప్రయాణం

▸▸ 20 గ్రామాల గిరిజనుల ప్రత్యక్ష నరకం


పలకజీడిలో కొండవాగు ప్రవాహాన్ని తాడు ఆధారంగా దాటుతున్న గిరిజనులు

కొయ్యూరు, జూలై 24: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కొండ వాగులు ప్రమాదకరంగా పరిణమించాయి. వరద నీటి తాకిడితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొంత మంది ప్రాణాలకు తెగించి తాళ్ల ఆధారంగా వాగులు దాటుతున్నారు.

మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీలో కొండవాగు ప్రవాహాలతో సుమారు 20 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వాగులు దాటేందుకు తాడు ఏర్పాటు చేసుకుని ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సిన పరిస్థితి నెలకొంది.

పలకజీడి, సమీప వేమనపాలెం, ఈదులబంద వద్ద బండిగెడ్డ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వాగులు అవతల గొల్లబంద, నీలవరం, పాలసముద్రం, మర్రిపాకలు, నక్కలమెట్ట జెర్రిగొంది, బంగారుబంద, తదితర గ్రామాలు ఉన్నాయి. వాటికి రహదారి సౌకర్యం లేదు సరికదా ఈ గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంలోకి రావాలంటే వాగులు దాటాల్సిందే. ఈ వాగులపై వంతెనలు నిర్మిస్తామన్న గత ప్రభుత్వ పాలకుల హామీలు అమలు కాకపోవడంతో వారం రోజులుగా గ్రామాలకే పరిమితమై గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు తాడు ఆధారంగా వాగులు దాటుతూ ప్రాణాలకు తెగించి సాహసాలు చేస్తున్నారు. వాగు దాటే సమయంలో ఏమాత్రం చెయ్యి పట్టుతప్పి తాడు వదిలితే ప్రాణాలు నీటిపాలవుతాయని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ వాగులపై వంతెనల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సురక్షిత ప్రయాణాలు సాగించేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, జూలై 24: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి తెలిపారు. కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్, హార్టికల్చర్, హిస్టరీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రరీ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులను నియమిస్తున్నట్టు చెప్పారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

పాడేరు రూరల్, జూలై 24: దివ్యాంగుల కోసం పనిచేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుంచి వివిధ జాతీయ అవార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్, ఎంపవర్‌మెంట్ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు జాతీయ అవార్డులకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్‌లు, నామినేషన్‌లు ఆన్‌లైన్ ద్వారానే అనుమతిస్తున్నట్టు చెప్పారు. జాతీయ అవార్డులకు ఎంపికైన వారికి అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 3న అవార్డులను అందిస్తారని తెలిపారు.

'కార్మికులకు ఉపయోగపడని బడ్జెట్'

అరకులోయ, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికులు, గిరిజనులకు ఏమాత్రం ప్రయోజనకరంగా లేదని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనంగి చిన్నయ్య, ఉమామహేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది కేవలం అంకెల గారడీతో ఆదివాసీలకు మోసగించే బడ్జెట్ అని బాలదేవ్ పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.12,641 కోట్లు కేటాయించగా, కేవలం రూ.7605 కోట్లు మాత్రమే ఖర్చు చేసి 39 శాతం నిధులను వదిలేయడం దారుణమన్నారు. పీవీటీజీలకు పీఎం జన్‌మాన్ పథకం కింద రూ.24 వేల కోట్లు కేటాయించారని, నిధులు విడుదల చేయకపోవడంతో 25 వేల ఇళ్లు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. చిరుద్యోగులకు, కార్మికులను కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. గిరిజనుల విద్య వైద్యానికి బడ్జెట్ పెంచలేదన్నారు. సంపన్నులకు మేలు చేకూర్చేలా కేంద్ర బడ్జెట్ ఉందని పెదవి విరిచారు.

బడ్జెట్‌లో మాటలు ఘనం.. నిధులు స్వల్పం

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

పాడేరు రూరల్, జూలై 24: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాటలు ఘనం, నిధులు స్వల్పం అన్నట్టుగా బడ్జెట్ ఉందన్నారు. ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన రాష్ట్ర ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగంలో పలుమార్లు ఆంధ్రప్రదేశ్ పేరు ప్రస్తావించారుగాని, నిధులు కేటాయింపులో నిరాశ కలిగించారన్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనడం వల్ల రాష్ట్రానికి, రాజధాని మేలు జరగదన్నారు. రూ.15 వేల కోట్లు నేరుగా గ్రాంటులా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నప్పటికీ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. పోలవరానికి రూ. 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్‌లో స్పందన లేదన్నారు. నిర్వాసితులను గాలికొదిలేసారని ఆయన విమర్శించారు.

'కేంద్ర బడ్జెట్ ఏపీకి ఆమోదయోగ్యం'

పాడేరు రూరల్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, రాష్ట్ర నాయకులు పెనుమాక రవికుమార్, సల్లా రామకృష్ణ అన్నారు. ఈ బడ్జెట్ యువత స్వావలంబన దిశగా అడుగులు వేస్తుందనడానికి ఎటువంటి అనుమానాలు లేవన్నారు. ఎంఎస్ఎంఈలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడం హర్షణీయమన్నారు. వచ్చే ఐదేళ్లలో రూ.2.2 లక్షల కోట్ల ధనం ఖర్చుపెట్టి దేశంలో అదనంగా మరో మూడు కోట్లు ఇల్లు కట్టించాలని ప్రతిపాదించడం ఆనందకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు ప్రకటించడం శుభపరిణామన్నారు. ఈ పరిస్థితులను చూస్తుంటే రాష్ట్రంలో చంద్రబాబు సారథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి ఉరకలు పెడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధార్ కేంద్రం సేవలు పొడిగించాలి

చింతపల్లి, జూలై 24: మండల కేంద్రంలో తాత్కాలి ఆధార్ కేంద్రం సేవలను మరో వారం రోజులు పొడిగించాలని టీడీపీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చింతపల్లి పంచాయతీలో 15 వేల జనాభా ఉన్నారని, తాత్కాలిక ఆధార్ కేంద్రం సేవలను వర్షాల కారణంగా వారు వినియోగించుకోలేకపోయారని చెప్పారు. సుమారు 80 శాతం మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోలేదన్నారు. ఎంపీడీవో ప్రత్యేక చొరవ తీసుకుని వారం పాటు తాత్కాలి ఆధార్ కేంద్రం సేవలను కొనసాగించాలని ఆయన కోరారు.

రిజర్వాయర్లు కళకళ

... 5వ పేజీ తరువాయి

నీటిమట్టం 1360 అడుగులు కాగా, ఇక్కడ 1360 అడుగులకు చేరువ అయితే నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో కూడా కేవలం 1500 నుంచి 2 వేలు క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని, అలాగే సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి అవుతున్న నేపథ్యంలో గుంటవాడ జలాశయం గేట్లు ఎత్తే పరిస్థితి రాదని జెన్‌కో ఈఈ ప్రభాకరరావు తెలిపారు.

అసెంబ్లీ సమావేశాలు అమరావతిలోనా? ఢిల్లీలోనా?

▸▸ గళం విప్పుతానన్న పాడేరు ఎమ్మెల్యే ఎక్కడ?

▸▸ రాజకీయ లబ్ధి కోసమే జంతర్‌మంతర్‌లో వైసీపీ ధర్నా

▸▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జూలై 24: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు అమరావతిలోనా? లేక ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరుగుతున్నాయా? అని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరావును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో జీవో నంబరు-3 పునరుద్ధరణ, ప్రత్యేక గిరిజన డీఎస్సీ, 1/70 చట్టం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయాలనే అంశాలపై పోరాటమే కాకుండా గిరిజనుల పక్షాన గొంతెత్తి ప్రశ్నిస్తానని పత్రికా సమావేశంలో చెప్పిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అసెంబ్లీలో కాకుండా ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జగన్‌తో పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీలో గిరిజన సమస్యలపై పోరాటం చేస్తానన్న విశ్వేశ్వరరాజు రాజకీయ, ఆర్థిక లబ్ధి కోసం వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చేసే కుట్ర చేష్టలకు సై అనేందుకు సిగ్గుగా లేదా? అని ఆమె ప్రశ్నించారు. రాజకీయ లబ్ధికోసమే జగన్‌రెడ్డి జంతర్‌మంతర్‌లో ధర్నా చేశారని ఆరోపించారు.

ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి

ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఊపిరి పీల్చుకొనే బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం హర్షణీయమన్నారు. అమరావతి నిర్మాణానికి రైతులు భూములు ఇస్తే, వాటిని జగన్ శ్మశానం చేయాలని చూశారన్నారు. చంద్రబాబు సీఎం కావడంతో ఏపీ ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు.

నిండుకుండల్లా జలాశయాలు


జలాశయం పొర్లు కట్టుపై నుంచి పారుతున్న వరదనీరు... నిండుకుండలా లుబ్బుర్తి జలాశయం

కొయ్యూరు, జూలై 22: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాలు వరద నీటిలో నిండు కుండల్లా మారాయి. లుబ్బుర్తి మినహా మిగిలిన మూడు జలాశయాలలో నీరునిల్వ ఉండేలా తగిన మరమ్మతులు లేక వృథాగా పోతోంది. మండలంలోని లుబ్బుర్తి, నగరం, గింజర్తి, చుట్టుబందలో జలాశయాలు ఉన్నాయి. వీటిలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకంలో లుబ్బుర్తి జయాశయం పూడిక తీత తీసి గట్టు పటిష్ఠం చేశారు. అనంతరం ప్రపంచ బ్యాంక్ నిధులతో పొర్లు కట్టు పునర్నిమాణం, అక్విడేట్ మరమ్మతులు చేశారు. అయితే పంట కాలువలు పూడికతీత తీయలేదు. అయినప్పటికీ ఈ రిజర్వాయరు ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాలకు చెందిన రైతులు ప్రతి ఏటా కాలువలు పూడిక తీసుకుంటూ రిజర్వాయరు నీటిని వినియోగించుకుని వర్షాభావ పరిస్థితులలో పంటలను కాపాడుకుంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఈ జలాశయం నిండుకుండలా మారింది. అలాగే గింజర్తి జలాశయం పూటుగా వరద నీరు చేరింది. ఈ జలాశయం గట్టు పటిష్ఠంగా లేక ఏ క్షణాన గట్టుకు గండి పడుతుందోననే భయాందోళనలో రైతులు ఉన్నారు. మొత్తమ్మీద అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జలాశయాలు జలకళతో దర్శనమిస్తున్నాయి.

అంధకారంలో మారుమూల గిరి గ్రామాలు


దీపాల వెలుగులో ఉన్న గిరిజనులు

ముంచంగిపుట్టు, జూలై 24: మండలంలోని మారుమూల బూసిపుట్టు పంచాయతీ పరిధిలో గ్రామాలు మూడు రోజులుగా అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నామని పాత ప్రాంతానికి చెందిన కె.దనుర్జయ్, పి.డెవిడ్, బి.బాలు, కె.బీమన్న, వి.మదు, బి.సోమేస్ తెలిపారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాలతో పాటు కొండ ప్రాంతాల్లో ఎక్కువ గ్రామాలు ఉన్నాయని, విద్యుత్ సరఫరా లేకపోవడం వలన రాత్రి వేళల్లో అత్యవసర పనుల నిమిత్తం బయటకు రావాలన్నా బయపడాల్సి వస్తుందని వాపోయారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో రాత్రి వేళల్లో ఇల్లలోకి ఎటువంటి క్రూర మృగాలు, విష సర్పాలు ప్రవేశిస్తాయోనని బిక్కుబిక్కుమంటు జీవనం సాగిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో విద్యార్థులు చదువుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని కోరుతున్నారు.


హుకుంపేటలో అడ్డుమండ ప్రధాన రహదారిలో విరిగి పడిన చెట్టు

☛ సంక్షిప్తంగా..

తుఫాన్ నష్టం అంచనాలో అధికారుల విఫలం

గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ

పాడేరు రూరల్/పెదబయలు, జూలై 24: జిల్లాలో పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలుల బీభత్సానికి రైతులకు జరిగిన నష్టాలపై అంచనాలు వేయడంలో అధికారులు విఫలమయ్యారని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీలో బుధవారం సీపీఐ మండల నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్రెమామిడిలో కె.సింహాచలం ఇల్లు కూలిపోవడంతో సామగ్రి మొత్తం ధ్వంసమైందని, ముంచంగి రాజుబాబు, లోచలి నూకాలమ్మ ఇళ్ల గోడలు కూలిపోయాయని, వంతాల చిట్టినాయుడుకు చెందిన అరటి, మొక్కజొన్న, కొండ కందుల పంటకు నష్టం వాటిల్లిందని వివరించారు. వరద ఉధృతికి పంట పొలాలు కొట్టుకుపోయి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. అధికారులు స్పందించి ఇళ్లు, పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య, సీపీఎం నాయకులు వి.బాలంనాయుడు, ఎస్.రమణదొర, కించాయి సింహాచలం, పూటి రాజు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు ధ్రువపత్రాలు

చింతపల్లి, జూలై 24: కౌలు రైతులకు సాగు ధ్రువపత్రాలు అందిస్తామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. చౌడపల్లి గ్రామంలో బుధవారం కౌలు రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా బ్యాంకులో పంట రుణం పొందవచ్చునన్నారు. అలాగే పంటల బీమాను నమోదు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలు, యంత్రాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సావిత్రి, వీహెచ్‌ఏ రాజు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

కొయ్యూరు, జూలై 24: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో సిబ్బంది, విద్యార్థులు అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి రాజబాబు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం భాగస్వామిగా ఉండి గ్రంథాలయ పితామహుడుగా పేరు పొందారన్నారు. అంతేకాకుండా గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమావేశం రేపు

కొయ్యూరు, జూలై 24: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి అందరూ హాజరుకావాలన్నారు. ఓడీఎఫ్ సర్వే, పీఆర్ ఒన్ యాప్, ఐహెచ్‌హెచ్‌ఎల్ఎస్ రిపోర్టు, ఆధార్ సర్వే తదితర అంశాలపై చర్చించనున్నట్టు చెప్పారు.

ఆవాస్ యోజన పనులు వేగవంతం

పెదబయలు, జూలై 24: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ ఈశ్వరి ఆధ్వర్యంలో ఉద్యోగులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021-2022 సంవత్సరానికి పీఎం ఆవాస్ యోజన పథకంలో అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి పథకం ద్వారా 90 రోజుల పని దినాలను కేటాయించాలన్నారు. నిర్దేశిత సమయంలో గృహ నిర్మాణ పనులను పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి నరసింగరావు, ఏపీవో పెదప్పలనాయుడు, ఈసీ సింహాచలం, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు ముమ్మరం


దోమల నివారణ మందు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

కొయ్యూరు, జూలై 24: గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు ముమ్మరం చేశారు. పంచాయతీ, వైద్యారోగ్య శాఖ సిబ్బంది మండల వ్యాప్తంగా ఫాగింగ్ నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా కార్యాలయాలకే పరిమితమై ఫాగింగ్ యంత్రాలను బయటకు తీసి ఆటోల ద్వారా వీధివీధిన దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నీటి నిల్వలు ఏర్పడి దోమలు విజృంభించే ప్రమాదం ఉంది. అలాగే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

ధారాలమ్మ ఘాట్ రోడ్డులో ప్రమాదం

సీలేరు, జూలై 24: ధారకొండ ఘాట్ రోడ్డులో బుధవారం ఆర్టీసీ బస్సు, ప్రైవేటు జీపు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. నర్సీపట్నం డిపోకు చెందిన పీటీడీ బస్సు అనకాపల్లి నుంచి సీలేరు వస్తుండగా ధారాలమ్మ గుడి సమీపంలో ధారకొండ నుంచి చింతపల్లి ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేటు జీపును ఢీకొంది. జీపు ముందు టైరు భాగం బస్సు కింద చిక్కుకుని ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

28న మండల సర్వసభ్య సమావేశం

చింతపల్లి, జూలై 24: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.వీరసాయిబాబు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు విధిగా హాజరుకావాలని కోరారు.